సాక్షి
నిర్మల్
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



క్వారీలో జంగల్ సఫారీ

మంచిర్యాల జిల్లాలోని ఎంసీసీ క్వారీ జంగల్ సఫారీకి వేదిక కానుంది. ఇన్నాళ్లూ ఎంసీసీ క్వారీ అంటే దుర్గాదేవి జాతర గుర్తుకు వచ్చేది. ఇక జంగల్ సఫారీకి ఆహ్వానించనుంది. 8లో ▸

గంగా హారతికి ఆహ్వానం

బాసర: కార్తిక పౌర్ణమి సందర్భంగా బాసరలో శుక్రవారం నిర్వహించే గోదావరి ప్రత్యేక హారతి కార్యక్రమానికి రావాలని బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయ ఈవో విజయరామారావు ముధుల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను ఆహ్వానించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఈవోకు సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /17.1

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం చాలా వరకు ఎండగా ఉంటుంది. ఇక రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

భూమాత కోసం నిరీక్షణ!

ఈ ఫొటోలోని రైతుపేరు కట్ట భూమారెడ్డి. కుంటాల మండలం విట్టపూర్ గ్రామానికి చెందిన ఈయనకు సర్వే నంబర్ 282లో 4.13 ఎకరాలకు సంబంధించిన పాత పాసు పుస్తకం ఉంది. అప్పట్లో పహణీ, వన్‌బీ మండల కార్యాలయం ద్వారా పొందాడు. ధరణి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక వీరికి కొత్త పాస్‌బుక్ అందలేదు. దీంతో ప్రభుత్వం ద్వారా అందజేసే రైతుబీమా, రైతుబంధు పథకాలకు అర్హత కోల్పోయాడు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విన్నవించినా ధరణి పోర్టల్‌లో ఆప్షన్ లేని కారణంగా ఏమీ చేయలేమని అధికారులు చెప్పారు. 2022, మేలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో 11 నూతన ఆప్షన్లు అందుబాటులోకి తేవడంతో ఇతని సమస్య తీరుతుంది అనుకున్నాడు. కానీ నేటికీ అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చే భూమాత పోర్టల్‌తో తన సమస్య పరిష్కారం అవుతుందని ఎదురు చూస్తున్నాడు.





- జిల్లాలో 1652 భూ సమస్యలు పెండింగ్
- ధరణి పోర్టల్‌లో దొరకని పరిష్కారం
- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
- కాంగ్రెస్ సర్కార్ తెచ్చే కొత్త పోర్టల్‌పై ఆశలు

ఈనెల 13 నాటికి జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు

మొత్తం పెండింగ్ దరఖాస్తులు	తహసీల్దార్ లాగిన్‌లో	ఆర్డీవో లాగిన్‌లో	అదనపు కలెక్టర్ లాగిన్‌లో	కలెక్టర్ లాగిన్‌లో
1,652	331	238	366	717

నిర్మల్‌చైన్‌గేట్: భూమాత ఎప్పుడొస్తావమ్మా.. అంటూ జిల్లాలోని ధరణి బాధిత రైతులు ఎదురుచూస్తున్నారు. ధరణి పోర్టల్‌తో భూసమస్యలు పరిష్కారం కాక రైతులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ భూములకు భలే డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యలు కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మీ సేవల్లో వేల రూపాయలు ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా లాగిన్లలో రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివి రిజెక్ట్ చేస్తున్నారు. ఈ విషయమై ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించగా అధికారుల నుంచి సరైన సమాధానమే ఉండడం లేదని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో భూ సమస్యలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

కలెక్టర్ లాగిన్‌లో 717 దరఖాస్తులు..

ధరణి పోర్టల్‌ను గత ప్రభుత్వం 2020, అక్టోబర్ 2న అమల్లోకి వచ్చింది. భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కరించేందుకు జీఎల్‌ఎం పేరిట వెసులుబాటు కల్పించింది. రైతులు మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా తహసీల్దార్లకు కలెక్టర్ చేరవేస్తారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన నాలుగు రోజుల్లోనే పరిష్కరించాలి. అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఏ దశలో ఉందనే విషయాన్ని సంబంధిత దరఖాస్తుదారుడికి తెలుపాలి. కానీ ఈనెల 13వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 1,652 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో తహసీల్దార్ లాగిన్‌లో 331, ఆర్డీవో లాగిన్‌లో 238, అదనపు కలెక్టర్ లాగిన్‌లో 366, కలెక్టర్ లాగిన్‌లో 717 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

అధికారుల నిర్లక్ష్యమే..

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా భూముల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ఉపయోగించిన ఎల్‌ఆర్ యూపీ వెబ్‌సైట్‌ను రద్దు చేసి ధరణి వెబ్‌సైట్‌ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్ పుణ్యమా అని భూ వివరాలు సరిదిద్దే అవకాశం తహసీల్దార్ల చేతుల నుంచి కలెక్టర్ల చేతుల్లోకి వెళ్లింది. రైతులు తమ భూ సమస్యలను ధరణి వెబ్‌సైట్ ద్వారా కలెక్టర్లకు విన్నవించేందుకు వెబ్‌సైట్ జీఎల్‌ఎం, టీం-33 మాడ్యుల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆప్షన్ల ద్వారా వేల మంది రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తున్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి సర్వే నంబర్‌పై మోఖా పంచనామా నిర్వహించి తుది నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడకు చేరిన నివేదికలను వేగంగా పరిశీలించి డిజిటల్ సంతకాలు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతుల దరఖాస్తులు నెలల తరబడి కలెక్టర్ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి.

మాడ్యూల్స్ లేని సమస్యలెన్నో..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మాత్రమే స్పెషల్ డ్రైవ్‌లో అవకాశం కల్పించారు. మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ నమోదు కావడానికి అవకాశం లేని ధరణి సమస్యలు కూడా ఎన్నో ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి డమ్మీ ఖాతాలు.. రికార్డుల ప్రక్షాళన సమయంలో గ్రామానికో డమ్మీ ఖాతాను సృష్టించారు. సర్వే నంబర్ వారీగా స్పష్టత లేని భూములు అంటూ మిగిలిన మొత్తం విస్తీర్ణాన్ని ఆ ఖాతాలలో వేసేశారు. ఇప్పటి వరకు డమ్మీ ఖాతాలు తెరుచుకోలేదు. ఇలాంటి మరెన్నో రకాల సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ధరణి వెబ్‌సైట్‌లో 75 రకాల సమస్యలను నిపుణుల కమిటీ గతంలో గుర్తించింది. మరో 40 నుంచి 50 రకాల సమస్యలు తాజాగా ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలిసింది.

కొత్త పోర్టల్‌పై ఆశలు..

ధరణి పోర్టల్‌లోని నిబంధనలతో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్ ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తేవాలని చూస్తోంది. దీనికి సంబంధించిన నిబంధనలు ఇంకా ఖరారు కానప్పటికీ ఆయా మండలాల్లోని తహసీల్దార్లు మాత్రం త్వరలో భూమాత వస్తుంది, మీ సమస్యలు త్వరగా పరిష్కరమయ్యే అవకాశం ఉందని చెబుతూ కార్యాలయాలకు వచ్చే రైతులను తిరిగి పంపిస్తున్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక.. పట్టాదారు, పాసుపుస్తకాలు రాక రైతులు బ్యాంకు రుణాలు, రైతుబంధు, ఇతర ప్రయోజనాలు పొందక తీవ్రంగా నష్టపోయారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ తీసుకువచ్చే భూమాత కోసం నిరీక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

భావవ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలి

- గిరిజన సంక్షేమశాఖ డీడీ చందన



మాట్లాడుతున్న చందన

నిర్మల్‌ఖిల్లా: అభ్యసన ప్రక్రియ ద్వారా విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలని రాష్ట్రగిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (విద్యావిభాగం) చందన సూచించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. ప్రతీ పాఠశాలలో 'యంగ్ ఒరేటర్ క్లబ్' ఏర్పాటు చేసుకుని విద్యార్థుల్లో ఆంగ్లభాష వ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకోగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. జిల్లా గిరిజనశాఖ అధికారి అంబాజీ, హెచ్‌ఎం ఆర్.తుకారం, విద్యార్థినులు, తల్లిందండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



కరణ్



నిర్గున్

లక్ష్మణచాంద: బేస్‌బాల్ అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. నిర్మల్‌లో గురువారం జరిగిన జోనల్‌స్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న కరణ్, నిర్గున్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ఎంపియ్యారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు



పరిశీలిస్తున్న విజయ రామారావు

భైంసాటౌన్: ఆలయ భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ నిజామాబాద్ సహాయ కమిషనర్ విజయరామారావు హెచ్చరించారు. పట్టణంలోని భైంసా–బాసర మార్గంలోని 435, 468 సర్వే నంబర్లలోని దేవాదాయ శాఖ భూముల్లో కబ్జాలను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వే నంబర్ 435లో శ్రీ వేంకటేశ్వర ఆలయానికి చెందిన 4.14 ఎకరాలు, అలాగే సర్వేనంబర్ 468లో నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని శ్రీవేంకటేశ్వర ఆలయానికి చెందిన 5.19 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు పరిశీలించి ఆక్రమణలను గుర్తించామన్నారు. కబ్జాలు తొలగించాలని నోటీసులు జారీ చేస్తామని, ఎలాంటి క్రయవిక్రయాలు జరుపవద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఈవో వేణు, ఇన్‌స్పెక్టర్ కమల ఉన్నారు.

నాట్యంలో కొరిటికల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న జోగన్‌పల్లి సాయిసహస్ర, పాకల ప్రణతి, లాస్య, హర్షిణి, పూదరి రితిక రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సంగీత, నాటక అకాడమీ, తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కొరిటికల్ పాఠశాల విద్యార్థులకు ప్రముఖ కవి, గీత రచయిత అందెశ్రీ బహుమతులు అందించారు. ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి రాధిక

సోన్: సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక సూచించారు. సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం అమ్మాయిలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీల విజేతలు సాయికృష్ణ, వివేక్, రాహుల్‌కు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆరాధన, ఉపాధ్యాయులు సుజాత, లింగాగౌడ్, సిరాజ్ హైదర్, ముత్తన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠకులకు సౌకర్యాలు కల్పిస్తాం

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ



మాట్లాడుతున్న అర్జుమంద్ అలీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రంథాలయంలో పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయంలో గురువారం ప్రారంభించారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా గ్రంథాలయం అగ్రభాగంలో ఉండాలన్నారు. ఇక్కడ చదివే పాఠకులు ఉన్నత స్థానానికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పర్యవేక్షణ.. మరింత పక్కాగా



ప్రభుత్వ పాఠశాలలో బోధనతీరును పరిశీలిస్తున్న ఎంఈవో(ఫైల్)

- అన్ని మండలాలకు విద్యాధికారుల నియామకం
- సర్కారు బడుల బలోపేతం దిశగా అడుగులు
- నాణ్యమైన ప్రభుత్వ విద్యకు దోహదం...

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టిసారించింది. విద్యాశాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తుండడంతో విద్యావ్యవస్థ బలోపేతంపై అధికారులు సైతం ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలకు సీనియర్ పీజీ హెచ్‌ఎంలను విద్యాశాఖ అధికారులుగా నియమించింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవోలందరికీ అక్టోబర్ 29న విద్యాక మిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డితోపాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. దీనితోపాటు రానున్న రోజుల్లో పాఠశాల విద్యాశాఖను మరింత పరిపుష్టం చేసేందుకు ప్రణాళికలను రూపొందించడంలో భాగంగా సలహాలు, సూచనలు కోరారు. సర్కారు బడుల ప్రతిష్టను మరింత పెంచేలా మండల విద్యాశాఖ అధికారులు పని చేయాలని సూచించారు. జిల్లా నుంచి 19 మంది రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణలో పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం విద్యార్థుల ప్రగతి కోసం ఎంఈవో సమష్టి కార్యాచరణతో ముందుకెళ్లాలని నిర్ణయించారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మొత్తం 19 మండలాలు ఉండగా గతంలో నాలుగైదు మండలాలకు ఒకరు ఇన్‌చార్జి మండల విద్యాధికారులుగా వ్యవహరించేవారు. మండలాల పరిధి ఎక్కువగా ఉండడంతో వారికి పర్యవేక్షణ చేయడంలో ఇబ్బందులు తలెత్తేవి. సారంగాపూర్ మండలానికి చెందిన ఎంఈవో.. పెంబి, దస్తురాబాద్ వంటి సుదూర మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో విధుల నుంచి తమను తప్పించాలని విజ్ఞప్తులు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మండలానికి ఒక ఎంఈవోను నియమించడంతో అధికారులతోపాటు ఉపాధ్యాయులు సైతం సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీనియర్ పీజీ హెచ్‌ఎంగా ఉన్న ఆయా మండలాల పరిధిలోని వారిని ఎంఈవోలుగా నియమించడంతో పర్యవేక్షణ చేసేందుకు సరళతరం అవుతుందని భావిస్తున్నారు.

బడుల బలోపేతానికి దోహదం...



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గత నెలలో మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు చేపట్టాం. గతంలో ఒక్కో ఎంఈవోకు నాలుగైదు మండలాలకు పైగా ఇన్‌చార్జి బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ భారం అయ్యేది. ప్రస్తుతం మండలానికో ఎంఈవోను కేటాయించడం శుభ పరిణామం. పర్యవేక్షణ బాధ్యతలను పకడ్బందీగా చేపడుతున్నాం. విద్యావ్యవస్థ మరింత పటిష్టం చేయడానికి మా వంతు ప్రయత్నం చేస్తాం.

– తొడిశెట్టి పరమేశ్వర్, ఎంఈవో, సోన్ మండలం

ఎంఈవోల విధులు ఇలా...

- మండల విద్యాధికారులు ప్రతీరోజు కనీసం రెండు పాఠశాలలను సందర్శించి తనిఖీ చేయాలి. పాఠశాలలో సమకూరిన వసతులపై ఆరా తీసి అవసరమైన వాటిని ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు చేపట్టాలి.
- మండల స్థాయిలో సర్వీస్ బుక్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశ పాఠశాల కమిటీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాలు విద్యాప్రమాణాలు పెంచే చర్యలకు మార్గ నిర్దేశం చేయాలి.
- మధ్యాహ్న భోజనం రుచి, శుచితో విద్యార్థులకు అందించేలా పర్యవేక్షణ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కుల పంపిణీ అమలుతీరును పర్యవేక్షించాలి.
- విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించే చర్యలను చేపట్టేందుకు మార్గనిర్దేశం చేయాలి. డ్రాపౌట్స్ కూడా తగ్గించేందుకు ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలి.
- మండల పరిధిలోని పాఠశాలల స్థితిగతులపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయాలి. ఉపాధ్యాయుల హాజరు, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేలా పర్యవేక్షించాలి.
- ప్రతీ సంవత్సరం అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యాయులకు, సీఆర్పీలకు తర్ఫీదు ఇవ్వాలి.

అధైర్య పడొద్దు..



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



ముఖాముఖికి హాజరైన పీయూసీ2 విద్యార్థులు

- పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి
- ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర: విద్యార్థినులు అధైర్య పడొద్దని, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు సూచించారు. పీయూసీ2 విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌తో కలిసి 17 కమిటీల విద్యార్థులతో వర్సిటీలో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. గతంలో ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అనంతరం స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లోని ఆడిటోరియంలో పీయూసీ2 విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయని, ధైర్యంగా అధిగమించాలని సూచించారు. నూతన ఆవిష్కరణలకు అంకురార్పణ చేసేలా ఆలోచనా విధానం ఉండాలని పేర్కొన్నారు. వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు ప్రొఫైల్ యాప్ రూపొందించాలని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సూచించారు. ప్రతిభతో రాణించేందుకు తగిన ప్రణాళికలు రచించుకోవాలన్నారు. మన ఆలోచనా విధానమే మనకు మార్పుకు నాంది పలుకుతుందని తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ నెల రోజులుగా వర్సిటీలో తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కోమల్‌డ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ రాజేశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, వివిధ విభాగాల అధికారులు, క్యాంపస్ చీఫ్ సెక్రెటరీ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆహారం వేటలోనే పులి

ఖానాపూర్: జిల్లాలో పెద్దపులి వేట కొనసాగిస్తోంది. మామడ అటవీ రేంజ్ పరిధిలోని పెంబి మండలం బుర్కలేగి గ్రామంలో సోమవారం ఎద్దును చంపిన పులి బుధవారం సాయంత్రం వరకు అదే కళేబరం తింటూ గడిపింది. గురువారం వేకువజామున 3 గంటల వరకు ఎద్దు కళేబరం తిటూ ఆకలి తీర్చుకుంది. అది అయిపోవడంతో తిరిగి వేటకు బయల్దేరింది. గురువారం మధ్యాహ్నం మామడ మండలం దిమ్మదుర్తి అటవీ రేంజ్ పరిధిలోని ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్) తండా శివారు అటవీ ప్రాంతంలో పశువుల మందపై పంజా విసిరింది. ఈ విషయం మండల ప్రజలకు తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. పులి సంరక్షణ చర్యలు చేపడుతున్న అటవీశాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పశువుల కాపరులు, రైతులు అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లొద్దని దిమ్మదుర్తి, ఖానాపూర్, మామడ ఎఫ్‌ఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, కిరణ్, అవినాస్ సూచించారు.

ధాన్యం కొనాలని ఆందోళన



రైతులకు నచ్చజెబుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

కుంటాల: ధాన్యం కొనుగోళ్లను నిలిపివేయడాన్ని నిరసిస్తూ లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామ రైతులు గురువారం రోడ్డెక్కారు. కుంటాల మండలం 61వ జాతీయ రహదారిపై అర్లి(కె) క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం నిర్వాహకులు ఆరు లారీల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ గోదాంకు తరలించారు. తరుగును రైతులే భరించాలని గోదాం నిర్వాహకులు చెప్పడంతో ఐకేపీ నిర్వాకులు ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. రెండు రోజుల క్రితం కొనుగోళ్లు ప్రారంభించి భైంసా మండలం వానల్‌పాడ్ రైస్‌మిల్‌కు తరలించారు. మిల్ యజమాని బస్తాకు 43 కిలోల చొప్పున తూకం వేసి తీసుకుంటానని చెప్పారు. దీంతో రైతులు బస్తాకు 42 కిలోలు మాత్రమే ఇస్తామని తెలుపడంతో బుధవారం మళ్లీ కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతులు న్యాయం చేయాలని కోరుతూ అర్లి(కె) క్రాస్ రోడ్డు వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న లోకేశ్వరం తహసీల్దార్ అర్క తుకారాం అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ఘటన స్థలికి చేరుకుని రైతులు చెప్పిన విధంగానే బస్తాకు 42 కిలోలు తూకం వేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున రైతులకు న్యాయం చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు. మూడు గంటల పాటు ఆందోళన చేయడంతో రోడ్డు కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. భైంసా, నిర్మల్ రూరల్ సీఐలు నైలు నాయక్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సైలు భాస్కరాచారి, హన్మాండ్లు, అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

గరిష్టం/కనిష్టం
32.2 /20.0
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది. వేకువ జామున మంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

ట్రిపుల్‌ఐటీని సందర్శించిన ఎస్పీ



ట్రిపుల్‌ఐటీ ద్వారం వద్ద ఎస్పీ జానకీషర్మిల

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని ఎస్పీ జానకీషర్మిల బుధవారం సందర్శించారు. ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని భద్రత సిబ్బందితో మాట్లాడారు. ట్రిపుల్‌ఐటీలో తరగతులు జరుగుతున్నాయని విద్యార్థులంతా మిడ్‌టర్మ్ పరీక్షలురాస్తున్నారని తెలిపారు. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలను నమ్మకూడదని సూచించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు తరగతులకు వెళ్తున్నారని అన్నారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

లోకేశ్వరం: బాసర ట్రిపుల్ ఐటీ ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. ఈనెల 11న విద్యార్థిని ఆత్మహత్యకు నిరసనగా ఆందోళన చేసిన వట్టోలి గ్రామానికి చెందిన ఏబీవీపీ కార్యకర్త సాయికుమార్‌పై సెక్యూరిటీ సిబ్బంది దాడి చేశారని తెలిపారు. నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏబీవీపీ కార్యకర్త సాయికుమార్‌ను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సాయన్న, మంద భాస్కర్, మంద గణేశ్ ఉన్నారు.

పకడ్బందీగా సర్వే



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేను పకడ్బందీగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో కుటుంబ సర్వే నిర్వహించే ముందు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటింటా పూర్తి సమాచారం సేకరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంఈవో ముత్యం, ఎంపీవో ఎంఏ.రహీంఖాన్, రఘునాథ్‌రెడ్డి, ఏపీఎం అశోక్, ఏఎస్‌వో సాయికృష్ణ, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆపాలని డిమాండ్



గ్రామస్తులను సముదాయిస్తున్న అధికారులు

ముథోల్: మండలంలోని వడ్తాల్ గ్రామంలో బుధవారం కుటుంబ సర్వేను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తర్వాతనే సర్వే నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అధికారులు గ్రామస్తులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సర్వేను కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నారాయణ్‌పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల కోసం వినతి



సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవికి విన్నవిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవితోపాటు సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్‌రావుకు విన్నవించారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 21 మంది నూతన కార్మికులను నియమించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయిని కలిసి అమృత్–2 స్కీం కింద మంజూరైన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మార్కెట్ యార్డు ఆవరణలో స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌ను కలిసి నిధుల కోసం విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, నాయకులు పరిమి సురేష్, అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

వసూల్ రాజాలు..!

- కాసుల కోసం కక్కుర్తి..
- ప్రతీ పనికి పైసా వసూల్
- 'జిల్లాస్థాయి' హోదాలోనూ ఇదే తీరు..!
- ఏసీబీ దాడులు చేస్తున్నా.. మారని తీరు
- పలువురు అధికారులపైనా ఆరోపణలు
- తాజాగా పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్



ఏసీబీకి పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్

నిర్మల్: వాళ్లు చేయాల్సిన పనికి ప్రభుత్వం వేతనం ఇస్తోంది. అయినా.. అదనంగా లంచం ఇవ్వనిదే ఏ పనీ చేయరు. అవినీతి నిరోధకశాఖ దాడులు చేస్తున్నా.. కేసులు పెడుతున్నా.. వసూల్ రాజాల తీరు మారడం లేదు. ప్రతీపనికి రేటు పెడుతున్నారు. పెద్దోడు, పేదోడు అనే తేడా చూడకుండా వసూలు చేస్తూనే ఉన్నారు. తాజాగా నిర్మల్ మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డాడు. సొంతశాఖ ఉద్యోగి సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేయడానికి రూ.20 వేలు డిమాండ్ చేయడం గమనార్హం. తమ కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన నియామకాలు, బదిలీల్లో జిల్లాస్థాయి హోదాలో ఉన్న ఓ 'పెద్దచేప' కూడా ప్రతీపనికి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతస్థాయిలో ఉండటంతో బయటకు వెల్లడించడానికి జంకుతున్నట్లు తెలుస్తోంది.

పైసలిస్తేనే పనవుతుంది..

జిల్లాలోని చాలా శాఖల్లో అధికారులు, సిబ్బంది పైసలిస్తేనే పనిచేస్తామంటున్నారు. కొంతమంది మాట్లాడితే.. ఎంతిస్తావ్.. అనే అడుగుతున్నారు. తమ ఆఫీసుల్లో పనుల కోసం వచ్చేవారెవరినీ వదలడం లేదు. ఎంతైతే అంత అన్నట్లుగా వివిధ స్థాయిలలో దోచుకుంటున్నారు. డబ్బులు ఇవ్వకపోతే రేపుమాపు అంటూ.. ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారు. తాజాగా నిర్మల్ మున్సిపల్‌లో ఇన్‌చార్జి ఆర్‌ఐగా, ఎస్టాబ్లిష్‌మెంట్(సీ–సెక్షన్)ను కూడా చూస్తున్న జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్ బిల్‌కలెక్టర్ భరత్‌కు సంబంధించి సర్వీస్‌బుక్‌లో నమోదు కోసం రెండు నెలలుగా రూ.20 వేలు ఇవ్వాలని వేధిస్తున్నాడు. చివరకు రూ.15 వేలకు ఒప్పుకుని డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయాడు.

గతేడాది పట్టుబడిన ఘటనలు కొన్ని..

- 2023, అక్టోబర్ 29న మామడ పోలీసుస్టేషన్‌లోనే స్టేషన్‌బెయిల్ కోసం వచ్చినవారి నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏకంగా ఎస్సై రాజు ఏసీబీకి చిక్కారు.
- 2023, నవంబర్ 4న నిర్మల్ జిల్లాకేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో బాధితుడి తండ్రి పేరిట ఉన్న భూమిని గిఫ్ట్ డీడ్ చేసేందుకు జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, ప్రైవేటు అసిస్టెంట్ రాజు రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు.
- 2023 డిసెంబర్ 18న కడెం మండలం పెద్దబెల్లాల్‌కు చెందిన గంగన్న రిజిస్టర్ లేబర్ అయిన తన తల్లి చనిపోవడంతో అందాల్సిన రూ.1.30 లక్షల పరిహారం కోసం రాగా.. అప్పటి కార్మికశాఖ అధికారి సాయిబాబా రూ.25 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- 2024, జనవరి 10న కడెం తహసీల్దార్ రాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్య ఏసీబీకి దొరికారు. కొత్తమద్దిపడగకు చెందిన బాధితుడు మూడు పట్టాలను తన పేరిట గిఫ్ట్‌డీడ్ చేయాలన్నందుకు పట్టాకు రూ.15 వేల చొప్పున డిమాండ్ చేశారు. డీటీ చిన్నయ్యకు రూ.9 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఈఏడాది జనవరి 25న నిర్మల్ మున్సిపాలిటీ ఆర్వో గంగాధర్, బిల్‌కలెక్టర్ నవంత్ ఓ ఇల్లు అసెస్‌మెంట్‌కు సంబంధించి రూ.3,500 తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

పెద్దసార్లు సైతం..

ఆ శాఖ.. ఈ శాఖ.. అని తేడాలేం లేవు. పెద్దసార్.. చిన్నసార్.. అని భేదాలూ లేవు. అన్నిశాఖల్లో.. అన్ని స్థాయిల్లో లంచం తప్పనిసరి అన్నట్లుగా తయారైంది. జిల్లాస్థాయిలో హోదాలో ఉన్న ఓ అధికారిపైనా ఇటీవల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ప్రతీ పనికి పైసలివ్వాల్సిందే. కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది బదిలీలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. నలుగురు కిందిస్థాయి అధికారులు, తన కార్యాలయంలోని ఓ సిబ్బంది సహకారంతో తతంగాన్ని నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అన్ని శాఖల్లో..

ఈ ఏడాది జిల్లాలో వరుసగా ఐదారు ఏసీబీ దాడులు జరిగాయి. పట్టుకున్న వారిలో వివిధ శాఖల వారున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్‌తో పాటు కార్మికశాఖలోనూ లంచాలను తీసుకుంటూ దొరికారు. చివరకు పోలీసుశాఖలోనూ లంచావతారులు ఉన్నట్లు వెల్లడైంది.



శివలింగానికి అలంకరణ చేస్తున్న వేదపండితులు

వైభవంగా ఆయుత చండీయాగం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలో శ్రీకృష్ణ కాలచక్ర శ్రీవైష్ణవ ఆయుతచండీ అతిరుద్ర మహాయాగం వైభవంగా జరుగుతోంది. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో నిత్యం యాగం, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయుత చండీ పారాయణం, శ్రీరుద్ర హోమం, చతుర్వేద నక్షత్ర నవగ్రహ, ధన్వంతరి హోమాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

బంద్ విజయవంతం



ఏబీవీపీ కార్యకర్త సాయికుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడికి నిరసనగా బుధవారం తలపెట్టిన బంద్ భైంసా డివిజన్‌లో విజయవంతమైంది. ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. దాడిలో గాయపడిన ఏబీవీపీ నాయకుడు సాయికుమార్‌ను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న అనుమానాస్పద ఘటనలను ఎవరు ప్రశ్నించినా దాడులుచేస్తున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని కోరారు.

సెక్యూరిటీ అధికారి సస్పెండ్...

బాసర ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సీఐ రాకేశ్ డిప్యూటేషన్‌ను రద్దు చేశారు. ఏబీవీపీ నాయకులపై దాడిచేసిన సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇక ఆదివారం అర్ధరాత్రి విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనలో క్యాంపస్ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఈ రణధీర్, పీయూసీ డీన్ పావని, కేర్ టేకర్ స్రవంతి, నాగరాజు, ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేశారు.

విధుల్లో చేరిన సెక్యూరిటీ సిబ్బంది...

సెక్యూరిటీ సిబ్బందిపై పోలీసు కేసు నమోదు కావడంతో మంగళవారం రాత్రి ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తంచేశారు. విధులు నిర్వహించిన తమపై కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం యథావిధిగా విధుల్లో చేరారు.

జిల్లా అధికారుల ఆరా...

ఆదివారం రాత్రి ఆత్మహత్యకుపాల్పడ్డ స్వాతిప్రియ సంఘటనపై జిల్లా అధికారులు ఆరాతీస్తున్నారు. ఇప్పటికే విద్యార్థిని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాల్స్ ఆధారంగా పూర్తిస్థాయి వివరాలు తెలుసుకునే ప్రయత్నంచేస్తున్నారు. ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో జరిగే సంఘటనకు బాధ్యులు ఎవరన్న విషయం తేల్చాలని రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని జేవీఎన్‌ఆర్ పాఠశాలలో బుధవారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాలకు అందుబాటులో ఉన్న వనరులతో చేసే విధానాన్ని వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ఉపాధ్యాయులు చూడాలని డీఎస్‌వో వినోద్‌కుమార్ సూచించారు. శిక్షణలో బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు సత్తన్న, కార్యదర్శి సుష్మారాణి, సుదర్శన్, గంగా సురేశ్, శిక్షకులు సురేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుర్కరేగడిలోనే పులి

- ఎద్దు కళేబరం వద్దకే మళ్లీ వచ్చిన టైగర్
- ట్రాప్ కెమెరాల్లో చిక్కిన దృశ్యాలు

పెంబి: మండలంలోని అంకెన గ్రామ పంచాయతీ పరిధిలోని బుర్కరేగడి గ్రామంలో సోమవారం రాత్రి ఎద్దును హతమార్చిన పెద్దపులి బుధవారం కూడా ఎద్దు కళేబరం వద్దకు వచ్చింది. ఘటన స్థలంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో పులి దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఎద్దును పులి తిన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఎద్దు కళేబరాన్ని పూర్తిగా తినే వరకూ పులి ఇక్కడే ఉండే అవకాశం ఉందని తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. ఈమేరకు మామడ, తాండ్ర, పెంబి రేంజ్ అధికారులు అవగాహన కల్పించారు.

మాతా మరణాలు తగ్గించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో మాతా మరణాలను నివారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య రోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆశ నోడల్ అధికారులు, పర్యవేక్షక సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హైరిస్కు గర్భిణులను ముందుగానే గుర్తించి, అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సేవలను అందించాలన్నారు. అధిక ప్రమాదం ఉన్న గర్భిణులు ప్రసవం అయ్యేవరకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరుగనున్న సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సెస్‌ఫుల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, డీసీహెచ్ఎస్‌ఓ సాయమ్మ, డిప్యూటీ జిల్లా విస్తరణ అధికారి బారే రవీందర్, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఆశ నోడల్ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఓటర్ జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్

- ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్రమోహన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్‌తో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. రాజకీయ పార్టీలు ప్రతీ పోలింగ్ కేంద్రానికి తమ ఏజెంట్లను నియమించాలని సూచించారు. జాబితా రూపకల్పనపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ కేంద్రానికి బూత్‌స్థాయి అధికారులను నియమించామని తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులకు దరఖాస్తు స్వీకరిస్తామని పేర్కొన్నారు. తుది ఓటరు జాబితాను జనవరి 6 ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు రత్నాకళ్యాణి, కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొరిపల్లి శ్రావణ్‌రెడ్డి, సయ్యద్ హైదర్, జగన్‌మోహన్, రిజ్వాన్‌ఖాన్, గంగారాం, అజర్, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

- యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ
- నేటి వరకు రెండు లైన్లు అందుబాటులోకి
- రెండ్రోజులు రైళ్ల రద్దు.. ప్రయాణికుల ఇబ్బందులు

రైలు ప్రయాణం ఆలస్యం



స్టేషన్ ఆవరణలోనే ప్రయాణికుల పడిగాపులు



నిర్మానుష్యంగా మంచిర్యాల రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రామగుండం, రాఘవపురం మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో గత రెండ్రోజులుగా రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే రంగంలోకి దిగిన రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. బుధవారం సాయంత్రం వరకు ఒక ట్రాక్ అందుబాటులోకి రాగా.. గురువారం వరకు మరొకటి అందుబాటులోకి రానుంది. మూడు ట్రాక్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే రెండ్రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రతీ రోజు బల్లార్షా నుంచి కాజీపేట, వరంగల్, కరీంనగర్ మధ్య నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక వస్తు, ముడిసరుకుల రవాణా పెద్ద ఎత్తున జరుగుతుంది. సింగరేణి నుంచి బొగ్గు, సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్, ఇతర సరకు రవాణా జరుగుతుంది. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపేందుకు కీలక మార్గంగా ఉన్న ఈ రూట్‌మీదుగా కాజిపేట నుంచి కాగజ్‌నగర్ వరకు అనేక మందికి ప్రయాణానికి ఉపయుక్తంగా ఉంది. అనుకోని ఘటన జరగడంపై రైల్వే అధికారులు ప్రమాదం జరిగిన కారణంపై విచారణ చేపట్టారు. సమస్య పరిష్కారానికి గత రెండ్రోజులుగా రాత్రింబవళ్లు సాంకేతిక నిపుణులు, అధికారులు, సిబ్బంది ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు.

రైళ్లు రద్దు, మళ్లింపు

ట్రాక్ పనులు పూర్తయ్యే వరకు రైళ్లన్నీ రద్దు చేశారు. కొన్ని రైళ్లను పాక్షికంగా దారి మళ్లించారు. పెద్దపల్లి నుంచి కరీంనగర్ మీదుగా నిజామాబాద్ వరకు, మరికొన్నింటిని బల్లార్షా, నాగ్‌పూర్, మైత్రి, సేవాగ్రామ్ జంక్షన్ల నుంచి మళ్లించారు. సికింద్రాబాద్, విజయవాడ, నాగ్‌పూర్ సూపర్‌ఫాస్ట్‌లను ఆయా జంక్షన్ల గుండా మళ్లించారు. దీంతో ప్రయాణం గంటల కొద్దీ ఆలస్యంగా సాగుతోంది. ఈ ప్రాంత వాసులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు రద్దీగా ఉండే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్, దానాపూర్ వంటి కీలక రైళ్లు రద్దు కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు రైల్వేస్టేషన్లలోనే పడిగాపులు కాస్తున్నారు. రాత్రి వేళ స్టేషన్‌లోనే చిన్న, పెద్ద అంతా అక్కడే ఉండిపోయారు. ప్రత్యామ్నాయం రోడ్డు మార్గం ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్నారు.

రూ.కోట్లలో నష్టం

మంచిర్యాల నుంచి సిర్పూర్ టౌన్ వరకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దీంతో రోజువారీగా ప్రయాణం చేసే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బంది ఏర్పడింది. ఇక గూడ్స్ రవాణాతోనూ సంస్థకు నిత్యం రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. ఈ క్రమంలో ఈ ఘటనతో ప్యాసింజర్, గూడ్స్ రవాణా నిలిచి రైల్వేకు రూ.కోట్లలోనే నష్టం వాటిల్లింది. గత ఏడాదిగా పలు కారణాలతో తరచూ రైళ్ల రద్దుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తాజాగా ఈ ఘటనతోనూ మళ్లీ ఇబ్బంది ఏర్పడింది.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద: పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ బుధవారం తనిఖీ చేశారు. ముందుగా సోన్ సీఐ నవీన్‌కుమార్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. తర్వాత సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం డీఎస్పీ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఠాణాలోని లాకప్, రిసెప్షన్ సెంటర్, రికార్డులు భద్రపరిచే గదిని పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేయాలని సూచించారు. ఆయన వెంట సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై సుమలత ఉన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

నిర్మల్‌ఖిల్లా: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయిదీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం సమీపంలోని గండి రామన్న శివాలయం క్షేత్రంలో కార్తీకదీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సాయిదీక్ష సేవాసమితి నిర్వాహకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 5:30 గంటలకు 11,116 దీపాలతో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గండి రామన్న ఆలయ క్షేత్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

క్లుప్తంగా

టిప్పర్ బోల్తా... వ్యక్తి మృతి


అల్తాఫ్(ఫైల్)

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బుధవారం టిప్పర్ బోల్తాపడింది. ఈ సంఘటనలో ఒకరు మృతిచెందినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. మండలంలోని తరోడా గ్రామానికి చెందిన అల్తాఫ్(42) మృతిచెందాడు. తన సొంత టిప్పర్‌తో మొరాన్ని తరోడా నుంచి బాసర వైపుకు తీసుకెళ్తుండగా అతివేగం, అజాగ్రత్త కారణంగా ముధోల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బోల్తాపడింది. ఈ ఘటనలో అల్తాఫ్ ఇరుక్క పోయి మృతి చెందాడు. సుమారు గంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మృతుడికి భార్య , ఇద్దరు కొడుకులు, కూతురున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌కు చెందిన మహ్మద్ మోహిన్ (16) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అశోక్‌రోడ్‌కు చెందిన ఎండీ షరీఫ్, పర్వీన్ బేగం దంపతుల రెండో కుమారుడు ఎండీ మోహిన్ స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లోని బాత్‌రూమ్‌లో విద్యుత్ బల్బు పని చేయకపోవడంతో హోల్డర్‌ను సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి బైండోవర్

జన్నారం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. మండలంలోని పుట్టిగూడకు చెందిన లక్ష్మణ్ అక్రమంగా చెట్లు నరుకుతూ స్మగ్లింగ్ చేస్తున్నాడని, చింతగూడకు చెందిన చెందిన పానగంటి శ్రీనివాస్ తన ఇంట్లో కలప అక్రమంగా నిల్వ చేసుకున్నాడని తెలిపారు. వీరిద్దరిని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

కుస్తీ పోటీలకు విద్యార్థిని ఎంపిక


నైతికతో పాఠశాల సిబ్బంది

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 జాతీయస్థాయి కుస్తీ పోటీలకు దండేపల్లి మండలంలోని కన్నెపల్లి మదర్‌థెరిసా ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పి.నైతిక ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్ జార్జ్, మేనేజర్ షైన్, కరస్పాండెంట్ లింటో, పీఈటీ దీపిక తెలిపారు. నారాయణపేట జిల్లా దన్వాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుచుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

బాలలు భళా..!

- వివిధ రంగాల్లో ప్రతిభ
- నేడు బాలల దినోత్సవం

మంచిర్యాలఅర్బన్: బాలలు చదువులో ఉన్నతంగా రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర వ్యాపకాలు ఎంతో అవసరం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విభిన్న రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఇన్‌స్పైర్, సకురా సైన్స్, నృత్య పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభతో ఔరా అనిపిస్తున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


ప్రధాని మోదీ టీ అమ్మిన హోటల్ వద్ద రైల్వేట్రాక్‌పై విష్ణువర్ధన్

ఇద్దరు విద్యార్థుల 'ప్రేరణ'


దర్శిని బజాజ్

మారుమూల ప్రాంతంలో చదివినా ప్రతిభకు కొదవలేదని నిరూపించారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన ప్రాంతాన్ని సందర్శించే అవకాశంతోపాటు స్వాతంత్ర్య దినోత్సవం రోజున నరేంద్రమోదీ జాతీయ జెండా ఎగురవేసే ఎర్రకోటకు వెళ్లే అరుదైన అవకాశాలను దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రేరణ కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో ఇద్దరు విద్యార్థులకు ఆ అవకాశం దక్కింది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 10న వికసిత్ భారత్ ప్రేరణ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిల్లో జిల్లా పరిషత్ కిష్టాపూర్ పాఠశాల విద్యార్థి ఆర్.విష్ణువర్ధన్, చెన్నూరు చిన్నముష్టి పాఠశాలకు చెందిన దర్శిని బజాజ్ ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రంలోని ప్రధాని మోదీ నివసించిన ఇల్లు, రైల్వేస్టేషన్, టీ అమ్మిన హోటల్, చదువుకున్న పాఠశాల, పనిచేసి దుకాణంతోపాటు సూర్యభగవాన్ ఆలయం, చారిత్రక కట్టడాలు సందర్శించారు. ఆగస్టు 15న స్వాత్రంత్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యమయూరి

- నృత్య పోటీల్లో సహస్ర ప్రతిభ
- ఎన్నో బహుమతులు కైవసం

జన్నారం: నృత్యం అంటే మక్కువ. తల్లి నృత్య కళాకారిణి కావడంతో కూతురూ కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ఎన్నో బహుమతులు సొంతం చేసుకుంది. జన్నారం మండలం పొనకల్‌కు చెందిన గాజుల నర్మద, రమేశ్ దంపతుల కూతురు సహస్ర(13) ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నర్మద కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ పొంది జన్నారంలో నటరాజ కళాక్షేత్రం నిర్వహిస్తూ నృత్యంలో శిక్షణ ఇస్తుండగా.. సహస్ర తల్లి వద్దే శిక్షణ పొందుతోంది. మంచిర్యాల జిల్లాతోపాటు కరీంనగర్, హైదరాబాద్, తిరుపతి, కాశీ వంటి ప్రదేశాల్లో జరిగిన కూచిపూడి, జానపద నృత్య పోటీల్లో ప్రతిభను చాటుకుంది.


బహుమతి అందుకుంటున్న సహస్ర(ఫైల్)

- ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలో జరిగిన నృత్య పోటీల్లో కాంతార వేషధారణతో అక్కడి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది.
- హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ప్రత్యేక కూచిపూడి కేటగిరి నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది.
- తిరుపతిలో జరిగిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన నృత్య పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
- ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళోత్సవ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి సాధించింది.

కూచిపూడిలో డాక్టరేట్ పొందాలని ఉంది

ఒకవైపు చదువుకుంటూనే అమ్మ సహాయంతో నృత్య పోటీల్లో పాల్గొంటున్నాను. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరిల్లో జరిగిన పోటీల్లో బహుమతులు సాధించాను. కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ పొందాలని నా కోరిక.

– సహస్ర, విద్యార్థిని


ఢిల్లీలో కాంతార నృత్య ప్రదర్శన(ఫైల్)

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు


పట్టుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సమీర్ ట్రేడర్స్‌లో కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 98 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి దినేశ్‌రెడ్డి తెలిపారు. ఇందులో విజిలెన్స్ ఏఎస్‌వో ప్రశాంత్‌రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామారావు తదితరులు ఉన్నారు.

నగదు డిపాజిట్ చేస్తుండగా చోరీ

భైంసాటౌన్: బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.50 వేలు అపహరించిన ఘటన పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన సురేశ్ ఈనెల 11న నిర్మల్ రోడ్‌లోని ఎస్బీఐలో రూ.90 వేలు డిపాజిట్ చేసేందుకు రాగా, ఫాం నింపుతున్న క్రమంలో డబ్బు ఉన్న బ్యాగ్‌లోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కొద్ది సేపటికి సురేశ్ బ్యాగు చూడగా, అందులో రూ.50 వేలు కనిపించకపోవడంతో షాక్ అయ్యాడు బ్యాంక్ సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరిగిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామ సమీపంలో బుధవారం మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై మహేందర్ తెలిపారు. పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీకి చెందిన మహ్మద్ ఎక్బాల్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య

బాసర:భైంసా రూరల్ మండలం సిద్దూర్ గ్రామానికి చెందిన యువకుడు బాసర వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన రాజు(35) ఎలాంటి పని చేయడ లేదు. రాజుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన రాజు బుధవారం బాసర వద్ద గోదావరి వంతెన పైనుంచి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వంతెనపై పర్సు, చెప్పులు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటన స్థలికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రాజు మృతదేహం లభించడంతో పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

ఖోఖో ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక


ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్ 14 జోనల్ స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. అండర్ 14 జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. శంకర్, సురేందర్, యాదవ్‌సాప్, గణేశ్, రాంబాబు, శివచరణ్, హనుమంతు, శివసాయి, తేజ, అక్షిత్ కుమార్, వర్షిత్, వేణు, భీమేశ్, అనిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

పెన్‌గంగలో కోటి దీపోత్సవం

కార్తికమాసం సందర్భంగా భీంపూర్ మండలం వడూర్ శివారు పెన్‌గంగ తీరంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్లి(టి) రామాలయ వ్యవస్థాపకులు శివానంద భారతీస్వామి ఆధ్వర్యంలో భక్తులు ఉత్సవమూర్తులతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. నదికి హారతి ఇచ్చి దీపాలను అందులో వదిలి మొక్కులు తీర్చుకున్నారు. మండలవాసులతో పాటు మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు.

– తాంసి


ఉత్సవమూర్తులతో తరలివస్తున్న భక్తులు

పాముకాటుకు మహిళ మృతి


బొడ్డు యశోద (ఫైల్)

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌కు చెందిన బొడ్డు యశోద(40) పాముకాటుకు మృతిచెందింది. ఎస్సై పి.రవీందర్ తెలిపిన వివరా ల ప్రకారం.. యశోద తన భర్త పోతన్నతో కలిసి తమ చేనులో బుధవారం పత్తి సేకరణకు వెళ్లింది. పాముకాటు వేయడంతో చికి త్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించా రు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. మృతురాలికి భర్త తోపాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన మావురపు జీవన్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జీవన్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరుతాయో లేదోనని మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహారాష్ట్రకు చెందిన ఒకరు..

మహారాష్ట్రలోని పటోర గ్రామానికి చెందిన మనోజ్ (35) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేయగా, పంట ఎదుగుదల లేకపోవడంతో దిగాలు చెందాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు.

బాలికపై అత్యాచార యత్నం

మంచిర్యాలక్రైం: బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ వ్యక్తిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన రాజేందర్ బాలిక(11)కు మంగళవారం రాత్రి మాయమాటలు చెప్పి హైటెక్ సిటీ సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లాడని పేర్కొన్నారు. అత్యాచారానికి యత్నించాడని బాధితురాలు కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా గోదావరి హారతి


గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

బాసర : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో గోదావరి హారతిని బుధవారం సాయింత్రం ఘనంగా నిర్వహించారు. నదీ తీరానగల సూర్యేశ్వర స్వామి ఆలయంలో వైదిక బృందం జ్వాలాతోరణ కార్యక్రమం ముందుగా నిర్వహించారు. అనంతరం అర్చకులు నదికి హారతి ఇచ్చారు. భక్తులు హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్వీస్‌బుక్‌లో ఎంట్రీకి లంచం

- బిల్ కలెక్టర్ వద్ద రూ.20 వేలు డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

నిర్మల్: తమ సొంత శాఖలో పనిచేసే బిల్ కలెక్టర్ వివరాలు సర్వీస్ బుక్‌లో నమోదు చేయడానికి కూడా రూ.20 వేలు లంచం అడిగిన ప్రభుద్దుడు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన నిర్మల్‌లో బుధవారం జరిగింది. నిర్మల్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ షాకీర్‌ఖాన్ బిల్ కలెక్టర్ నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కరీంనగర్ డివిజన్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితుడు భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన భరత్ కారుణ్య నియామకం కింద నిర్మల్ మున్సిపల్‌లో బిల్‌కలెక్టర్‌గా నియామకమయ్యాడు. ఉద్యోగ వివరాలను సర్వీస్‌బుక్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంది. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ చూసే షాకీర్‌ఖాన్ తనకు రూ.20 వేలు ఇస్తేనే పనిచేస్తానని చెప్పాడు. రెండు నెలలుగా భరత్ బతిమాలుతున్నా పట్టించుకోలేదు. చివరకు రూ.15 వేలు ఇస్తేనే చేస్తానని చెప్పడంతో అంగీకరించాడు. దీంతో భరత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఉదయం బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కొనసాగుతున్న కౌన్సెలింగ్

నస్పూర్: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సర్ఫేస్‌లో గల 16 డజిగ్నేషన్లలో ఉద్యోగాలపై ఇస్తున్న కౌన్సెలింగ్ బుధవారం కొనసాగింది. కౌన్సెలింగ్‌లో మొత్తం 85 మంది మహిళా బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం శ్రీధర్‌రావు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, ఎస్ఈ కిరణ్‌కుమార్, అధికారులు కాంతారావు, మల్లయ్య, రవీందర్, చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏజెల్ల శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: రిటైర్డ్ పోలీస్ అధికారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజెల్ల శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ క్లబ్‌లో జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీంలో ఉన్న స్కీంలను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులకు హెల్త్ స్కీంకు సంబంధించి రూ.800 అలవెన్స్ ఇస్తారని, దానిని రూ.వెయ్యికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 మార్చి తరువాత నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎల్ఎం టాక్స్‌మెంట్, గ్రాట్యుటీ కమిషన్‌కు సంబంధించిన నగదు రాక అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ విడుదల చేయాలని, ఆదాయ పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాలో కార్యవర్గాల ఏర్పాటు అనంతరం రాష్ట్ర సమావేశం నిర్వహించి డిమాండ్లను ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ ఎం.రాజమల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రాజమౌళిగౌడ్, ఉపాధ్యక్షుడు టి.వేణుగోపాలస్వామి, సంయుక్త కార్యదర్శి ఎండీ.తాహెరుద్దీన్, మంచిర్యాల గౌరవ అధ్యక్షుడు జే.నారాయణరావు, ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తుపాకీతో బెదిరించి చోరీకి యత్నం


సీసీఫుటేజీలో నమోదైన దొంగల దృశ్యం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని అడ్డకూరి రమేశ్ అనే వ్యాపారి ఇంటి వద్ద తుపాకీతో బెదిరించి దొంగతనానికి ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రమేశ్‌కు చెందిన వైన్స్ దుకాణంలో పనిచేసే లక్ష్మణ్‌గౌడ్ రోజూ దుకాణం బంద్ చేసిన తర్వాత డబ్బులను తీసుకొచ్చి రమేశ్‌కు అప్పగించేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి దుకాణం మూసేసిన తర్వాత లక్ష్మణ్‌గౌడ్ డబ్బులు తీసుకుని బైక్‌పై వచ్చి రమేశ్ ఇంటిముందు ఆగాడు. అప్పటికే కాచుకొని ముసుగులతో ఉన్న ఇద్దరు దొంగలు లక్ష్మణ్‌ను తుపాకీతో బెదిరించగా తప్పించుకుని ఇంటిలోపలికి పరిగెత్తాడు. వెంటనే దొంగలు బైక్ కీ తీసుకొని స్కూటీపై పారిపోయారు. సీసీఫుటేజీ ఆధారంగా పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సతీశ్ దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

విషమంగానే శైలజ ఆరోగ్యం

వాంకిడి: హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. శైలజతో పాటు నిమ్స్‌లో చికిత్స పొందిన జ్యోతి, మహాలక్ష్మి పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం వారిని డిశ్చార్జ్ చేసినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. అయితే శైలజ ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను ఫోన్ చేసి తెలుసుకోగా ఆరోగ్యం మెరుగుపడలేదని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కాగా మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.